క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 12న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. సుబేదారి, శాంతినగర్ (డీఐజీ బంగ్లా ఏరియా), జెడ్పీ గెస్ట్ హౌస్, రోహిణి ఆస్పత్రి ప్రాంతాల్లో ఉదయం 8.30నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు రెడ్‌క్రాస్‌లో ముగ్గుల పోటీలు

హన్మకొండ అర్బన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈనెల 13న హనుమకొండలోని రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు సొసైటీ పాలకవర్గ సభ్యురాలు చెన్నమనేని జయశ్రీ తెలిపారు. విజేతలకు నగదు బహుమతి అందించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనేవారు 83673 56765, 83670 56765 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

స్వీపర్‌పై చర్య తీసుకోవాలి



ఎంజీఎం: రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న నర్సులను అకారణంగా దూషించిన స్వీపర్ రాజమ్మపై చర్య తీసుకోవాలని నర్సింగ్ ఉద్యోగులు ఎంజీఎం ఆస్పత్రిలో గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించినందుకు స్వీపర్‌పై అధికారులకు హెడ్ నర్సు పద్మలత ఫిర్యాదు చేశారని తెలిపారు. దాంతో స్వీపర్ రాజమ్మ.. సదరు హెడ్‌నర్సుతో పాటు నర్సింగ్ ఉద్యోగులందరిని దూషించారని ఆందోళన వ్యక్తం చేశారు.

కామన్ మెస్‌లోని సమస్యలు పరిష్కరించాలి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కామన్ మెస్‌లోని సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ అధ్యక్షుడు కొక్కుల ప్రశాంత్, బాధ్యులు కోరారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ న్యూపీజీ బాయ్స్ హాస్టల్‌లోని నూతన మెస్‌ను త్వరగా ప్రారంభించాలని సూచించారు. కామన్‌మెస్‌లో విద్యార్థులకు బయోమెట్రిక్ అటెండెన్స్ విధానం ప్రవేశపెట్టాలని, నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. లక్ష్మణ్, యశ్వంత్, రాము, వేణుగోపాల్, శ్రావణ్ పాల్గొన్నారు.


ఆలయాల్లో చండీహోమం

కాజీపేట: గురువారం అమావాస్యను పురస్కరించుకుని కాజీపేట 62వ డివిజన్ విష్ణుపురిలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో చండీహోమం నిర్వహించారు. నాగదండానికి ప్రత్యేక పూజలు జరిపించిన అనంతరం సిద్ధి, బుద్ధి సమేత గణనాథుడికి నిత్య కల్యాణ వేడుకలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని అన్నపూర్ణ భవనంలో భక్తులకు మహాన్నదానం చేశారు.

రంగనాథస్వామి దేవాలయంలో..

కాశిబుగ్గ: అమావాస్యను పురస్కరించుకుని వరంగల్ కాశిబుగ్గలోని రంగనాథస్వామి దేవాలయంలో గురువారం చండీహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంగరి రవి, ప్రధాన కార్యదర్శి చిలుపూరి సురేష్, కోశాధికారి సుల్తానా సమ్మక్క, ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, రామాచార్యులు, విక్కీ, శ్రీనివాస్, సృజన, రోజా, కవిత తదితరులు పాల్గొన్నారు.

డీడీఎన్ క్యాలెండర్ ఆవిష్కరణ



హన్మకొండ కల్చరల్: ధూప, దీప నైవేద్య (డీడీఎన్) అర్చక సమాఖ్య నూతన సంవత్సర క్యాలెండర్‌ను వేయిస్తంభాల దేవాలయ ప్రాంగణంలో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, డీడీఎన్ అర్చక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు, మహేంద్ర కుమారాచారి, అర్చక వెల్ఫేర్ బోర్డు రాష్ట్ర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ సభ్యులకు ఐడీ కార్డుల పంపిణీ

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ వడ్డేపల్లి ట్యాంక్‌బండ్‌పై వాకర్స్ అసోసియేషన్ సభ్యులు నూతన సంవత్సర క్యాలెండర్‌తో పాటు ఐడీ కార్డులను సభ్యులకు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, కోశాధికారి అగర్వాల్, మహమూద్ అలీ, మెజీషియన్ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, నాగపురి సారయ్య తదితరులు పాల్గొన్నారు.

లష్కర్‌బజార్ పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



మధ్యకోటలో బహుమతుల పంపిణీ



బాలసముద్రంలోని శ్రీనివాస్ గురుకుల్ స్కూల్‌లో..



సంక్రాంతి సందడి

సంక్రాంతి పర్వదినం సందర్భంగా నగర వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు గురువారం సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు అందమైన ముగ్గులు వేశారు. భోగి మంటలు వేసి సందడి చేశారు. ఈ సందర్భంగా ముగ్గుల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే, బాలురు ఉత్సాహంగా పంతంగులు ఎగురవేశారు. వివిధ వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.

\- సాక్షి నెట్‌వర్క్



హంటర్‌రోడ్డులోని షైన్ హైస్కూల్‌లో భోగి మంటలు..



వరంగల్ ఓసిటీ స్టేడియంలో ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు



హసన్‌పర్తి: సుజాత విద్యానికేతన్ పాఠశాలలో..



హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాలలో..



వివిధ వేషధారణలో కిషన్‌పుర మాస్టర్‌జీ స్కూల్ చిన్నారులు

లాల్ బహదూర్ శాస్త్రి గొప్ప త్యాగశీలి



మాట్లాడుతున్న రాఘవేందర్

కాజీపేట రూరల్: లాల్ బహదూర్ శాస్త్రి రైల్వేశాఖ తొలి మంత్రిగా ఉన్న సమయంలో జరిగిన ఒక రైలు ప్రమాదానికి బాధ్యత వహించి తన మంత్రి పదవికి రాజీనామా చేసిన గొప్ప త్యాగశీలి అని తెలంగాణ రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కోండ్ర నర్సింగరావు కొనియాడారు. కాజీపేట రైల్వే కాలనీలో శాస్త్రి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



హనుమకొండ హనుమాన్ నగర్ -1లో..

హనుమాన్‌నగర్‌లో శాస్త్రికి నివాళి

హన్మకొండ: దేశ రెండవ ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమర యోధుడు, భారతరత్న అవార్డు గ్రహీత లాల్ బహదూర్ శాస్త్రి 57వ వర్ధంతిని హనుమకొండ హనుమాన్ నగర్ -1లో గురువారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా శాస్త్రి చిత్రపటానికి బీఆర్‌ఎస్ నాయకుడు చల్ల వెంకటేశ్వర్ రెడ్డి, కాలనీ వాసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యార్థులు కష్టపడి ఉన్నతస్థాయికి ఎదగాలి



రామన్నపేట : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని హనుమకొండ అదనపు కలెక్టర్ రాధిక గుప్తా పేర్కొన్నారు. గురువారం రాత్రి గోల్డెన్ ఓక్ పాఠశాల వార్షికోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వల చేసి పిల్లలనుద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి తల్లిదండ్రులకు గుర్తింపు తేవాలని సూచించారు. పాఠశాల చైర్మన్ గంట రవికుమార్ మాట్లాడుతూ భారతీయత అంటే నేను కాదు.. మనం అహంకారం కాదు. ఆత్మీయత మమకారం అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దయాసాగర్, దీప్తి, విజయలక్ష్మి, సృజన పాల్గొన్నారు.

బాధిత మహిళలకు రక్ష ‘సఖి’

హసన్‌పర్తి: ఆపదలో ఉన్న మహిళలు, బాలికలకు సఖి వన్ స్టాప్ కేంద్రం రక్షణ కల్పిస్తోందని సీడీపీఓ స్వరూప తెలిపారు. ఎర్రగట్టు వేంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో సఖి కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు పలు అంశాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సఖి వన్‌స్టాప్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. సమస్య ఎదురైనప్పుడు 0870 – 2452112, 181 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కల్పన, స్వరూప, సఖి వన్‌స్టాప్ సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ వినీల, అంగన్‌వాడీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ స్వరూప

అర్ధరాత్రి గుడిసెల తొలగింపు



హసన్‌పర్తి: 56వ డివిజన్ గోపాలపురం ఊర చెరువులోని ఆరెకరాల్లో దాదాపు 200 గుడిసెల్ని బుధవారం అర్ధరాత్రి పోలీసులు తొలగించారు. పోలీసు బలగాలు భారీగా మోహరించాయి. విషయం తెలుసుకున్న సీపీఎం నేతలు గురువారం ఉదయం అక్కడికి చేరుకుని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో కొంతమంది సీపీఎం నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

గుడిసెల కూల్చివేత అన్యాయం

హన్మకొండ అర్బన్: గోపాలపురం చెరువు శిఖంలో రెండేళ్ల నుంచి నివాసముంటున్న పేదల గుడిసెలను కూల్చివేయడాన్ని సీపీఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు తెలిపారు. గుడిసెల కూల్చివేతని ఖండిస్తూ.. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాయకులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వాసుదేవరెడ్డి, ఎం.చుక్కయ్య, నాయకులు వాంకుడోతు వీరన్న, వెంకట్, రాములు, తిరుపతి, సంపత్, కిశోర్, జయశ్రీ, సాంబయ్య, రాజు, కుమార్ పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే విజయం సొంతం



మాట్లాడుతున్న విద్యార్థి

మడికొండ: విద్యార్థులు ఆత్మవిశ్వాసం, పట్టుదలతో చదివితే భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని మాజీ డీఎస్పీ దామెర నర్సయ్య సూచించారు. మడికొండలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విద్యారణ్యపురి, ఓరుగల్లు వినియోగదారుల రక్షణ సమితి గోపాలపురం ఆధ్వర్యంలో సంస్కార వికాస శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సంధ్యారాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో నర్సయ్య మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం కష్టపడి చదవాలని చెప్పారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను శ్రద్ధగా ఆచరణలో పెట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తేరాల యుగంధర్, ఉపాధ్యాయురాలు విష్ణుప్రియ, సంస్థ కార్యవర్గ సభ్యుడు గోకారపు రాజేందర్ పాల్గొన్నారు.

‘బిల్కిస్ బానో’ దోషులను అరెస్ట్ చేయాలి

ఖిలా వరంగల్: సుప్రీంకోర్టు తీర్పు మేరకు బిల్కిస్ బానో కేసు దోషులను అరెస్ట్ చేసి జైలుకు పంపాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి నలిగంటి రత్నమాల డిమాండ్ చేశారు. ఖిలా వరంగల్ పడమరకోటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఐద్వా ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, బాలికలపై దారుణాలకు తెగపడుతున్న దుండగులను కఠినంగా శిక్షించాలని సూచించారు. కార్యక్రమంలో జయ, శ్రావణి, సరోజన, రమ, సాల్మన్, బన్నీ, విజయ, భవాని తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు

‘కుర్సా’ నూతన కమిటీ ఎన్నిక

కేయూ క్యాంపస్: కేయూ రీసెర్చ్ స్కాలర్స్ (కుర్సా) అసోసియేషన్ కమిటీని యూనివర్సిటీలో ఎన్నుకున్నట్లు కుర్సా మాజీ అధ్యక్షుడు నరేష్ ప్రకటించారు. అధ్యక్షుడిగా ఉషన్‌నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎండీ.పాషా, ఉపాధ్యక్షుడిగా కల్లెపెల్లి ప్రశాంత్, వెంకటనాయక్, జానకీరాములు, శ్యామల, సలహాదారులుగా డాక్టర్ ప్రేమ్‌సుందర్, డాక్టర్ మేడారపు సుధాకర్, నర్సింహారావు, నరేష్, సహాయ కార్యదర్శులుగా రూబీనా, శ్రీకాంత్, సోమరాజు ఎన్నికయ్యారు.

‘సీఎంఆర్’ను వేగంగా పూర్తిచేయాలి



రైస్‌మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఖిలా వరంగల్: సీఎంఆర్ డెలివరీని వేగవంతం చేయాలని, రా రైస్, బాయిల్డ్ రైస్ లక్ష్యాన్ని పూర్తిచేయాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. ఈమేరకు కలెక్టర్ సమావేశ మందిరంలో రబీ 2022 – 23, వానాకాలం 2022 – 23 సీఎంఆర్ డెలివరీపై పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఎఫ్‌సీఐ, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్లు, రైస్ మిల్లర్స్‌తో గురువారం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 118 రైస్ మిల్లులు ఉన్నాయని తెలిపారు. వానాకాలం 2022 – 23లో 1,79,925 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేయగా.. 1,07,673 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ పూర్తయినట్లు వివరించారు. లక్ష్యానికి అనుగుణంగా రా రైస్, బాయిల్డ్ రైస్ పూర్తి చేసేందుకు రైస్ మిల్లర్లు సహకరించాలని సూచించారు. వేసవిలో 15,39,04,240 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, ఇప్పటి వరకు 2,42,21,006 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ డెలివరీ చేసినట్లు వివరించారు. సమావేశంలో సివిల్ సప్లై డీఎం సంధ్యారాణి, అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్ సయ్యద్ ఫజల్ హుస్సేన్, ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్ ప్రకాశ్‌వర్మ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తోట సంపత్‌కుమార్, ఉపాధ్యక్షుడు గోనెల రవీందర్, సివిల్ సప్లై డీటీలు కిరణ్‌కుమార్, రేణుక, అధికారులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

లింగ నిర్ధారణ పరీక్షలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రావీణ్య హెచ్చరించారు. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో జరిగిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఆస్పత్రుల యాజమాన్యాలు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే ఆస్పత్రులను సీజ్ చేయడంతోపాటు వారి సర్టిఫికెట్ల రద్దుకు సిఫార్సు చేసి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ గోపాల్‌రావు, డాక్టర్ ప్రకాశ్, ఫసియొద్దీన్, ఎస్సై అయితు వెంకటేశ్వర్లు, అధికారులు అనిల్‌కుమార్, రాజ్‌కుమార్, నవీన్, నాగరాజు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం



వెంకన్నను సన్మానిస్తున్న ఎంవీఐ రవీందర్



కాజీపేట: అవగాహన కల్పిస్తున్న సీఐ సుజాత

ఖిలా వరంగల్: రోడ్డు భద్రతపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వరంగల్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కోల రవీందర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న సూచించారు. నెహ్రూ యువకేంద్రం హనుమకొండ ఆధ్వర్యంలో వరంగల్ రవాణాశాఖ, వరంగల్ సిటీ ట్రాఫిక్ నేతృత్వంలో 11నుంచి 17వ తేదీ వరకు జరగనున్న రోడ్డు భద్రత వారోత్సవాలు వరంగల్ హంటర్‌రోడ్డులోని తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో గురువారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో తాళ్ల పద్మావతి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ మల్లేశం, డైరెక్టర్ వరుణ్, నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి అన్వేష్ చింతల, ప్రిన్సిపాల్ డాక్టర్ జూపల్లి వెంకటేశ్వర్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌తోనే ప్రమాదాలు

కాజీపేట: మద్యం తాగి వాహనాలు నడపడం వల్లనే రహదారులపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ట్రాఫిక్ సీఐ సుజాత తెలిపారు. రహదారుల భద్రతపై కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్డెపల్లి పింగిళి కళాశాలలో విద్యార్థినులకు గురువారం అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రతీఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. ఏసీపీ ఎం.భోజరాజుతో పాటు కళాశాల యజమాన్యం పాల్గొన్నారు.

కాటన్ ఇండస్ట్రీ రాయితీలు ఇవ్వాలి

వరంగల్: కాటన్ ఇండస్ట్రీస్‌కు రావాల్సిన ఇన్‌సెంటివ్స్ (రాయితీలు) విడుదల చేయాలని, ఆర్‌అండ్‌సీ మేజర్స్ ప్రకారం వేసిన పీనల్ చార్జెస్ పూర్తిగా రద్దు చేయాలని, ఫారం -ఏ సర్టిఫికెట్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ పాలసీ 2015 -20కి ఇప్పించాలని తెలంగాణ కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి కోరారు. ఈమేరకు తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కోరారు. హైదరాబాద్‌లోని ఫ్యాప్సీ బిల్డింగ్‌లో పారిశ్రామికవేత్తలతో గురువారం ఏర్పాటు చేసిన ఇంటరాక్షన్ మీటింగ్‌కు అందిన ఆహ్వానం మేరకు రవీందర్‌రెడ్డితో పాటు సభ్యులు హాజరయ్యారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్, కృష్ణారెడ్డి, సంపత్, రాజేష్ కరానీ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

విద్యా సదస్సును విజయవంతం చేయాలి

విద్యారణ్యపురి: ఇటీవల స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయురాలు, డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) సీనియర్ కార్యకర్త, సామాజిక ఉద్యమకారిణి ఎస్.అనితకు అభినందన సభ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 12న ఉదయం హనుమకొండలోని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ కార్యాలయంలో విద్యా సదస్సు, అభినందన సభ నిర్వహించనున్నట్లు హనుమకొండ డీటీఎఫ్ మండల అధ్యక్షుడు మధుమురళి, ప్రధాన కార్యదర్శి ఎం.రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

మడికొండ: బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. 46వ డివిజన్ మడికొండ, రాంపూర్ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు.. కాంగ్రెస్ కాజీపేట మండలం అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజు ఆధ్వర్యంలో టేకులగూడెం గ్రామంలోని డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి నివాసంలో పార్టీలో చేరారు.

పిల్లలకు పతంగుల పంపిణీ

కాజీపేట: సంక్రాంతిని పురస్కరించుకొని స్నేహ యూత్ అసోసియేషన్ సభ్యులు కాజీపేటలో పిల్లలకు పతంగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్నేహ యూత్ అధ్యక్షుడు కుమ్మరి రాజ్‌కుమ్మర్, రాబర్ట్, ఫాయిజ్, రాజేష్, రంజిత్ పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు పద్మశాలీల నివాళి

కాజీపేట: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, సామాజిక సేవ కార్యకర్త శ్రీరామ శ్రీనివాస్‌కు కాజీపేట చౌరస్తాలో సంఘం సభ్యులు నివాళులర్పించారు. తెలంగాణ జాతీయ ఐక్యవేదిక రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పాము రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తేలు సారంగపాణి, చిలువేరు మహేష్, దేవులపల్లి సదానందం, వనం బలరాం, రామకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

వైద్యుల సంక్షేమానికి పాటుపడాలి

ఖిలా వరంగల్: వైద్యుల సంక్షేమానికి నేషనల్ మెడికల్ అసోసియేషన్ కార్యవర్గం కృషి చేయాలని కూరపాటి ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ కూరపాటి రమేష్ కోరారు. ఇటీవల ఎన్నికైన ఉమ్మడి వరంగల్ జిల్లా నేషనల్ మెడికల్ అసోసియేషన్ కార్యవర్గ అధ్యక్షుడు డాక్టర్ గుండా రవీందర్, కార్యదర్శి డాక్టర్ మైదం రాజు, కోశాధికారి డాక్టర్ పిట్ట సత్యంను వరంగల్ ఫోర్ట్‌రోడ్డు ఏకశిలనగర్‌లోని రూపిని హాస్పటల్ ప్రాంగణంలో గురువారం సన్మానించారు.

ఉచిత వైద్య శిబిరం

కాజీపేట: కాజీపేట పట్టణంలోని లతా వెంకట్ ఆర్థో అండ్ జనరల్ కేర్ ఆస్పత్రిలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత థైరాయిడ్ వైద్య శిబిరాన్ని డాక్టర్ మాధవరం శ్రీలత ప్రారంభించారు.

కేయూ బీఎస్‌ఎఫ్ నూతన కార్యవర్గం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో బీఎస్‌ఎఫ్ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నట్లు కేయూ బీఎస్‌ఎఫ్ ఇన్‌చార్జ్ కల్లెపల్లి ప్రశాంత్ తెలిపారు. అధ్యక్షుడిగా శివకుమార్ కమ్మర్‌పల్లి, ప్రధాన కార్యదర్శిగా రొంపల్లి నర్సింహ, ఉపాధ్యక్షులుగా తాండ్ర శ్రీహిత, అజిత్‌కుమార్, కార్యదర్శిగా జుమిడి నవీన్, కోశాధికారులుగా నాంపెల్లి వినోద్, చిట్టింపెల్లి రఘుకుమార్ ఎన్నికయ్యారు.

వరంగల్ ఎంపీ టికెట్ ఇవ్వండి

నయీంనగర్: వరంగల్ ఎంపీ టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ కోరారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరంగల్ ఎంపీ స్థానానికి తాను బరిలో ఉన్నానని వివరించారు.

బీఆర్‌ఎస్ నుంచి కేటాయించాలని..

కేయూ క్యాంపస్: వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని కాకతీయ యూనివర్సిటీ ఎకనామిక్స్ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నిరంజన్ కోరారు. ఈమేరకు పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వినతిపత్రం అందజేశారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన మొగిలి

హన్మకొండ: హైదరాబాద్‌లో బీజేపీ నేత కిషన్‌రెడ్డిని పార్టీ సీనియర్ నాయకుడు జన్ను మొగిలి కలిశారు. తనకు పార్టీ నుంచి వరంగల్ ఎంపీ టికెట్ ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందించారు.

కొండెక్కిన కొత్త వేతనాలు!

- పండుగ వేళ ఉద్యోగుల్లో పరేషాన్
- నేడు విధులు బహిష్కరించాలని ఉద్యోగ సంఘాల పిలుపు

కేయూ క్యాంపస్: కేయూలో దినసరి వేతన, లంప్సమ్, క్యాజువల్ ఉద్యోగుల వేతనాలు పెంచినప్పటికీ అమలు చేయడంలో జాప్యం జరుగుతోంది. దీంతో ఆయా ఉద్యోగులు 705 మందికి ఈనెల 11 గడిచినా వేతనాలు విడుదల కాలేదు. గతేడాది డిసెంబర్ మూడో వారంలో వేతనాల పెంచుతున్నట్లు వీసీ రమేశ్ ప్రకటించారు. దీంతో ఉద్యోగులు జనవరిలో డిసెంబర్‌కు సంబంధించి పెరిగిన వేతనాలు విడుదల చేస్తారని భావించారు. కానీ దినసరి వేతన, లంప్సమ్ క్యాజువల్ ఉద్యోగులు కాంట్రాక్టు /ఔట్‌సోర్సింగ్ విధానంలో జీఓ 60 అమలు కోసం విధివిధానాల్ని రూపొందించేందుకు వేతనాల పెంపును ఆయా కేటగిరీ ఉద్యోగుల అమలుకు తీసుకోవాల్సిన అంశాలపై పరిశీలనకు కమిటీని నియమించారు. మూడ్రోజుల్లో కమిటీ రిపోర్టు ఇవ్వాలని యూనివర్సిటీ అధికారులు ఆదేశించారు. కమిటీ ఆయా మూడు విభాగాలుగా ఇచ్చే వేతనాలు ఎంత అనేది ఇప్పటికే నిర్ణయించింది. ఔట్‌సోర్సింగ్ విధానంలో అమలు చేసేదెలా అనేది పరిశీలిస్తోంది. బయటి ఏజెన్సీలకు కాకుండా ఆయా ఉద్యోగుల్లోనే పలువురికి ఏజెన్సీలాగా అప్పగించే అంశాన్ని సైతం కమిటీ పరిశీలిస్తోంది.

జీఓలో ఏం ఉందో ఎవరికీ తెలియదు!

ఆయా ఉద్యోగులకు సంబంధించి యూనివర్సిటీలో ఐదు ఉద్యోగ సంఘాల బాధ్యులు, ఉద్యోగులు గురువారం పరిపాలనా భవనం వద్దకు చేరుకున్నారు. కేయూ యూజీసీ కో-ఆర్డినేటింగ్ కార్యాలయంలో కమిటీ చైర్మన్ ఇతర బాధ్యులు ఉండగా.. అక్కడికివెళ్లి ఆయా ఉద్యోగ సంఘాల బాధ్యులు త్వరగా కమిటీ రిపోర్టు ఇవ్వాలని, తమకు పెరిగిన వేతనాల్ని విడుదల చేయాలని కోరారు. కమిటీ చైర్మన్ మాత్రం అనుకున్నంత సులువుగా కమిటీ రిపోర్టు ఇచ్చే పరిస్థితి లేదని, ఎందుకంటే పెంచిన వేతనాల అమలుకు సంబంధించి విధివిధానాలను అధ్యయనం చేస్తున్నామని మరో వారం రోజులు పట్టే అవకాశం ఉందని వెల్లడించారు. దీంతో ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. మరోవైపు సంక్రాంతి పండుగ కూడా సమీపించిందని, పెరిగిన వేతనాల జీఓ ఎప్పుడో వచ్చినప్పటికీ అమలుకు చర్యలు చేపట్టకపోవడంతోనే కమిటీ కాలయాపన చేస్తోందని ఆవేదన చెందారు. కమిటీ రిపోర్టును ఈనెల 12న సమర్పించి కొత్త వేతనాలు చెల్లించాలని, లేకపోతే విధులు బహిష్కరించాలని ఉద్యోగులు నిర్ణయించినట్లు ఉద్యోగ సంఘాలు గురువారం సాయంత్రం వెల్లడించాయి.